రంజని

# అనుభూతికి బుద్ధిలేదుట!

—గంగుల నరసింహారెడ్డి

ఎదురు సీట్లో-కుందనపు బొమ్మ!

హృదయ స్పందన హెచ్చింది.

మనసు నిండా తీయని అనుభూతులు ముసురుకున్నాయి.

ఆలోచనలు దూది పింజల్లా తేలిపోసాగాయి.

తనది కిటికీ దగ్గరి సీటే అయితే ఆ అమ్మాయిది కూడా తన కెదురుగా నున్న సీటే-కిటికీ దగ్గరిది. ఆమెకు ప్రక్కన ఆమె తల్లిదండ్రులు కాబోలు కూర్చొని ఉన్నారు. తన ప్రక్కన కూడా ఎవరో ఇద్దరు నడివయసు వాళ్ళున్నారు.

ఆమె విషయంలో తన కెవరూ పోటీదారుడు లేనందుకు ఎంతో సంతోషం కలిగించిందతనికి.

ఏయిర్ బాగ్‌ను పైన పెట్టి కూర్చున్నాడు. అలవోకగా ఆమె వంక ఓ చూపు విసిరాడు.

బాపుంది-

అమ్మాయి చాలా బాపుంది.

ఉంగరాల జుట్టు-

ఎర్రని లేత పెదాలు-

పెద్దవైన కళ్లు-

గుండ్రని మొహం-

పరిపూర్ణంగా, పరిపుష్టిగా ఉన్న అవయవ సంపద-

బాపుంది!

చాలా అందంగా ఉంది!!

అదృష్టం-

తనదెంతో అదృష్టం-

ఇంత అందమైన అమ్మాయికి ఎదురుగా కూర్చొని ప్రయాణించడం-ఎంత అదృష్టం?!

ఎంతో ఒద్దికగా కూర్చుంది-?!

బట్టలు ధరించడంలో కూడా మంచి అభిరుచి ఉన్నట్లుంది.

పట్టు పరికిణీ బాపుంది-

జార్జెట్ వోణీ గర్వంగా ఉంది-

పట్టు జాకెటు బిగుతుగా ఉంది-

కళ్లు చెదిరిపోతున్నాయి.

మనసు వశం తప్పుతుంది.

ఏం పేరో-?!

ఉమా...రమా...

ఉషా...నిషా...

ఛీ, ఛీ, నిషా ఏంటి-

ఎంతో అందమైన పేరే ఉండి ఉంటుంది.

ఊరికే కూర్చుంటే చాలదు.

తను దిగిపోయేలోగా మాటలు కలపాలి.

మాట్లాడకుండా కూర్చుంటే ఆమెను చూస్తూ కూర్చోవడం కుదరదు.

రంజని

తల తిప్పి కిటికీ గుండా స్టేషనులోని సందడిని చూస్తూంది,

చెవులకు అందంగా కదులాడుతున్న జూకాలు-

నునుపుగా నిగ్గుదేలి మెరుస్తున్న బుగ్గలు-

సంపెంగ నాసికకు మెరుస్తున్న నీలపు రాయి-

శంఖం మెడను అలంకరించిన సన్నని బంగారు గొలుసు-

గుండ్రని భుజాలు-

తల తిప్పి చూసిందామె.

దృష్టి మరల్చుకున్నాడతను.

టైం చూసుకున్నాడు-రైలు కదలడానికి ఇంకా పది నిమిషాలుంది.

తల్లిదండ్రులు ప్రక్కనుంటే ఆ అమ్మాయితో ఏ రకంగా మాటలు కలుపాలో అర్థం కాలేదు. ఆమె దగ్గర ఏ మ్యాగజైనైనా ఉండి ఉంటే-

మెరుపులా ఓ ఆలోచన.

తన దగ్గరే పత్రికలుంటే-ఆ అమ్మాయే అడుగుతుంది కదా.

ఆడపిల్లలు పత్రికలను చూస్తేచాలు అన్నీ మరచి, నోరు తెరచి అడిగేస్తారు.

వెంటనే లేచి బయటకు దిగి వెళ్ళాడు.

ఒక తెలుగు వార పత్రిక కొన్నాడు. మరీ ఒక్కటయితే బావుండదని ఇంకో మాసపత్రిక కూడా కొన్నాడు.

రెండూ తీసుకొని రెండడుగుల్లు వేయగానే మరో ఆలోచన.

రెండూ తెలుగు పత్రికలే తీసుకొని వెళ్తే ఆ అమ్మాయి తనను తక్కువగా ఊహిస్తుందేమో?! 'ఇతడు తెలుగు పత్రికలే చదువుతాడా ఏంటి?' అని అనుకుంటే—ఓ ఇంగ్లీషు పత్రికైనా ఉంటే స్టయిలుగా ఉంటుంది.

మళ్ళీ వెనుదిరిగి బుక్ స్టాల్ దగ్గరికి వెళ్ళి ఓ ఇంగ్లీషు పత్రిక తీసుకున్నాడు.

మొత్తం పదిరూపాయలు దాటింది ఖర్చు.

హుందాగా రైలెక్కుతుండగా కదిలింది రైలు.

వెళ్ళి సీట్లో కూర్చొని తెలుగు పత్రికల్ని ముందర పెట్టుకొని ఇంగ్లీషు పత్రికను తెరిచాడు.

సాధారణంగా అతనికి ఏ పత్రిక కొని చదివే అలవాటు లేదు. ఏ లైబ్రరీలోనో, ఎవరి దగ్గిర నుండో తీసుకొని చదవడమ్మో చేస్తుంటాడు. అదీగాక ఇంగ్లీషు పత్రికలు అంత ఇష్టంగా చదవడు.

అతను తీసుకున్నది-ఇండియాటుడే పక్ష పత్రిక. కళ్ళు మాత్రం పుస్తకంలోకి చూస్తున్నా అతని మనసు మాత్రం ఎదురుగా కూర్చున్న అమ్మాయి గురించే ఆలోచిస్తున్నది.

'ఏమండీ ఆ పత్రిక ఓసారిలా ఇస్తారా?' అనే ఆ అమ్మాయి కోమలమైన కంఠధ్వని కోసం అతని చెవులు ఎదురు చూస్తున్నాయి.

బరువుగా పదిహేను నిమిషాలు గడిచాయి.

విసుగొస్తుందతనికి.

ఇంగ్లీషు పత్రిక బలవంతంగా తిరగేయాలంటే చిరాకు కలుగుతుంది.

'ఏమండీ ఆ పత్రిక ఓ సారిలా ఇస్తారా' అని అడుగుతుందా అమ్మాయి.

'విత్ ప్లెజర్' అని తను ఒకటి ఇస్తాడు.

పుస్తకం చదువుతున్న ఆమె తను చూస్తూ వంకాలం గడుపవచ్చు.

పది నిమిషాల్లో ఆ పత్రిక నంతటిని తిరగేసి

ఇచ్చేస్తూ 'ఇంకేదో మంత్లీ కూడా ఉన్నట్లుంది ఇస్తారా' అని సిగ్గుపడుతూ మొహమాటంగా అంటుంది.

'ఈ మాత్రానికి ఇంత బిడియ పడతారేం, తీసుకోండి, నేనొక్కన్నే చదవడానికి కొన్నాననుకుంటున్నారా, చదవండి, అందరూ చదివితేనే కదా సార్థకత ఏర్పడేది...'

'అవునవును'

'నా గురించి ఎక్కువ చెప్పుకుంటున్నానని అనుకుంటారేమో గాని, నాకీ ప్రయాణాల్లో చార్జీల కంటే పుస్తకాల ఖర్చే ఎక్కువవుతుంది.'

'అలాగా...' అసలే పెద్దవైన తన కళ్ళని ఇంకా పెద్దవిగ చేసి తన వంక అబ్బురంగా చూస్తుందామె.

ఆమె ఆ పత్రికని తిరగేసి తిరిగి తనకు ఇచ్చేస్తూ 'ప్చ్, ఏం ఉంటుందండీ ఈ కథల్లో చదవాలని పించడమే లేదీ మధ్య. అన్నీ ఉబుసుపోని కథలు-ఏవయినా మాట్లాడండి, మీరు భలే మాట్లాడతారు' అంటుందామె.

'ఏదో లెండి...మీరెందాకా వెళ్తున్నారు'.

చెబ్తుందామె.

తను చెబుతాడు.

'అయితే మీకు ఈ ప్రయాణమంతా కంపెనీ ఇవ్వరన్న మాట-ప్చ్'.

'ఏం చేస్తామండి మరి'.

'మీరేమనుకోపోతే మీ పేరేంటో తెలుసుకోవచ్చా'.

చెబుతుంది.

'మీకు తగ్గపేరు' మెచ్చుకుంటాడు తను.

సిగ్గుతో ఎరుపెక్కిన బుగ్గలతో కళ్ళు దించుకుంటుంది.

తను దిగవలసిన స్టేషన్ వస్తుంది.

'ఇక వస్తానండి, థాంక్సండీ మంచి కంపెనీ ఇచ్చినందుకు'.

'అయ్యో వెళ్తున్నారా, అప్పుడే స్టేషన్ వచ్చిందా? మీతో మాట్లాడుతున్నంత సేపు టైమే తెలియలేదండి' అంటుందామె విచారంగా.

'ఏం చేస్తామండి, మనం ఆగమంటే ఈ కాలం ఆగుతుందా' అని వేదాంతంగా నవ్వి తను ముందుకు కదుల్తాడు.

ఓ సారి వెను దిరిగి కళ్ళతోనే వెళ్లొస్తానని చెబుతాడు. ఆమె కూడా తన అందమైన కళ్ళ నిండా కన్నీటితో వీడ్కోలు చెబుతుంది.

"ఎక్స్క్యూజ్ మీ..."

ఊహల్లోంచి తలెత్తాడు.

''......ఆ పత్రిక ఇస్తారా"

నిజమే! తన ఊహ నిజమవుతుంది.

ఆ అమ్మాయి స్వయంగా తనే అడుగుతుంది.

తనతోనే మాట్లాడుతుంది.

''విత్ ప్లెజర్'' వార పత్రికను తీసి ఇచ్చాడు.

ముఖానికి పత్రిక అడ్డం పెట్టుకొని చదవడం ప్రారంభించిందామె. దృష్టిలోపమా ఏంటని అతడు లోలోపలే అనుమాన పడ్డాడు. ఆ ముఖారవిందం తిలకించే భాగ్యం పోయిందే అని విచార పడ్డాడు.

ఒక్కొక్క పేజీ చాలా శ్రద్ధగా చదువుతుందామె.

సరిగ్గా ఓ గంట తరువాత పత్రిక అతనికి తిరిగి ఇచ్చేస్తూ "అది కూడా ఇవ్వండి'' అంది మాస పత్రికను కళ్ళతోనే చూపుతూ.

నీరసంగా తీసి ఇచ్చాడు.

ఆతనికి తెలుసు-ఈ మాస పత్రికను, దాని అను బంధ నవలను చదవడానికి ఇంకో రెండు గంటల సమయం తీసుకుంటుందని, ఆ సమయానికి తను దిగ వలసిన స్టేషన్ వస్తుంది.

నిజమే! దించిన తల ఎత్తకుండా దీక్షగా చదివేసిందా అమ్మాయి ఆ పుస్తకాన్ని.

అతడు లేచి ఏయిర్ బ్యాగ్ తీసుకుంటుండగా పుస్తకాన్ని తిరిగి అతని కిచ్చేస్తూ ''థ్యాంక్సండీ'' అందామె నిర్వికారంగా.

పుస్తకాన్ని అందుకొని రైలు దిగాడు.

రైలు కదిలి వెళ్ళిపోయింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి.

ఇంటి దగ్గరున్న రోగిష్టి తల్లీ-

పెళ్ళి కెదిగిన చెల్లీ-

'ఖర్చు పెట్టే ప్రతీ పైసా మన పరిస్థితిని ఆలోచించి పెట్టునాయినా' అని ఎప్పుడూ తనని హెచ్చరించే తండ్రి మాటలూ-

కళ్లదించి చేతిలోని పుస్తకాల వంక చూశాడు.

పది రూపాయలు !

తల మరల్చి రైలు వెళ్ళి పోయిన పట్టాల వంక చూశాడు.

ఎప్పటికీ కలువని సమాంతర రేఖలు !

వేపకాయ తిన్నంత చేదుగా తయారయింది మనసు.

పుస్తకాల్ని ఏయిర్ బ్యాగులో వేసుకొని బరువైన బ్యాగును పట్టుకొని ఇంకా ఎంతో బరువుగా ముందుకు కదిలాడతను.

కూటికోసం కొట్లాడితే ప్రజాస్వామ్య ఉల్లంఘన

ఓటుకోసం కొట్లాడితే ప్రజాస్వామ్య ఉద్ధరణ